

చింతపల్లి సమీపంలో దట్టంగా కురుస్తున్న మంచు

నేటి నుంచి శంఖారావం

ఉమ్మడి జిల్లాలో ప్రారంభం కానున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పర్యటన

- తొలిరోజు పురుషోత్తపురం, చిట్టివలసల్లో సభలు
- 18న అప్పుఘర్, ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, గోపాలపట్నంలలో...
- 19న బిర్లా జంక్షన్, గాజువాక లంకా మైదానంలో...



విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'శంఖారావం' పేరుతో చేపట్టిన యాత్ర శనివారం నుంచి ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ప్రారంభం కానున్నది. శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు పెందుర్తి నియోజకవర్గం పురుషోత్తపురంలో జరిగే సభలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 5.30 గంటలకు భీమిలి నియోజకవర్గ పరిధిలోని చిట్టివలస జూట్ మిల్లు మైదానానికి చేరుకుంటారు అక్కడ సభ ముగిసిన అనంతరం నగరానికి చేరుకుని అప్పుఘర్ వద్ద బస చేస్తారు. 18వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గాదిరాజు ప్యాలెస్ సమీపాన, రెండు గంటలకు విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో, సాయంత్రం ఐదు గంటలకు విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని వెంకటాపురంలో నిర్వహించనున్న సభల్లో పాల్గొంటారు. ఆదివారం రాత్రి విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని బిర్లా జంక్షన్ సమీపాన గల హోండా షోరూమ్ వద్ద బస చేస్తారు. 19వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అక్కడ జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు గాజువాక లంకా మైదానంలో ఏర్పాటుచేసిన సభలో ప్రసంగిస్తారు. తరువాత అనకాపల్లి జిల్లా పర్యటనకు బయలుదేరి వెళతారు.

గత ఏడాది నారా లోకేశ్ యువగళం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర నిర్వహించిన విషయం తెలిసిందే. పాదయాత్రను డిసెంబరు 18న గాజువాక వద్ద ముగించారు. 20వ తేదీన విజయనగరం జిల్లా పోలిపల్లి వద్ద నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్నారు. అయితే విశాఖ జిల్లాలో గాజువాక తప్ప మిగిలిన నియోజకవర్గాల్లో, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో లోకేశ్ పాదయాత్ర జరగలేదు. ఉత్తరాంధ్రతోపాటు పాదయాత్రలో పర్యటించిన నియోజక వర్గాల్లో 'శంఖారావం' పేరుతో లోకేశ్ సభలు నిర్వహిస్తున్నారు. .

19, 20 తేదీల్లో అనకాపల్లి జిల్లాలో..

అనకాపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం యాత్ర ఈనెల 19న జిల్లాలోకి ప్రవేశించనుంది. సోమవారం అనకాపల్లి, చోడవరం నియోజకవర్గాల్లో సభలు జరగనున్నాయి. 20వ తేదీన మాడుగుల, నర్సీపట్నం, పాయకరావుపేట నియోజకవర్గాల్లో శంఖారావం యాత్ర కొనసాగనున్నది.

పరాయి పంచన వ్యవసాయ శాఖ

జిల్లా ఏర్పడి రెండేళ్లు అవుతున్నా సొంత గూడు లేని దుస్థితి

- మార్కెటింగ్ శాఖ గోదాములో నిర్వహణ
- అసంపూర్తిగా ఏడీ కార్యాలయం నూతన భవన నిర్మాణం
- బిల్లులు చెల్లించకపోవడంతో నాలుగేళ్ల క్రితం పనులు ఆపేసిన కాంట్రాక్టర్

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

అల్లూరి సీతారామరాజు పేరుతో పాడేరు కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటై 22 నెలలు గడిచినప్పటికీ జిల్లా వ్యవసాయ శాఖకు పాడేరు సొంత గూడు ఒనగూరలేదు. అరకొర వసతితో పరాయి పంచన కార్యాలయాన్ని ఏర్పాటు చేసి విధులు నిర్వహిస్తున్నారు. మండల వ్యవసాయాధికారి కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరడం, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయం నూతన భవన నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో జిల్లావ్యవసాయ శాఖ కార్యాలయాన్ని మార్కెటింగ్ శాఖకు చెందిన గోదాములో ఏర్పాటు చేశారు.



మార్కెటింగ్ శాఖ గోదాములో నిర్వహిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయం

పాడేరు కేంద్రంగా 2022 ఏప్రిల్ 4వ తేదీన కొత్త జిల్లా ఏర్పాటైన విషయం తెలిసింది. అప్పటి వరకు డివిజన్ కేంద్రంగా వున్న పాడేరులో అప్పటికే పలు శాఖలకు డివిజన్‌స్థాయి కార్యాలయాలు వున్నాయి. కొత్త జిల్లా ఏర్పాటు కావడంతో జిల్లాస్థాయి కార్యాలయాలను చాలా వరకు డివిజన్‌స్థాయి కార్యాలయాల భవనాల్లోనే ఏర్పాటు చేశారు. కానీ వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయానికి సొంత భవనం లేదు. అంతకుముందు చాలా ఏళ్ల క్రితం నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరడంతో 2018లో నూతన భవన నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ.42 లక్షలు మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్.. సుమారు రూ.25 లక్షలు విలువ చేసే పనులు పూర్తయిన తరువాత నిధులు విడుదలకు బిల్లులు పెట్టారు. అయితే రాష్ట్రస్థాయి అధికారులు తొలుత సాంకేతిక కారణాలతో నిధులు విడుదల చేయలేదు. తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చింది.



నాలుగేళ్ల నుంచి అసంపూర్తిగా వున్న వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయం నూతన భవన నిర్మాణం

అయినా బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. తరువాత బిల్లుల మంజూరు విషయాన్ని కాంట్రాక్టర్‌తోపాటు సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులు కూడా పలుమార్లు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. గత నాలుగేళ్లుగా భవన నిర్మాణ పనుల్లో ఎటువంటి కదలిక లేదు. దీంతో పిచ్చి మొక్కలు పెరిగిపోయి దిష్టిబొమ్మలా తయారైంది.

ఇదిలావుండగా రెండేళ్ల క్రితం పాడేరు కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటైన విషయం తెలిసిందే. మండల వ్యవసాయాధికారి కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరడం, ఏడీ కార్యాలయం నూతన భవన నిర్మాణం ఆగిపోవడంతో జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సుంద్రుపుట్టు వీధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు చెందిన గోదాములో ఏర్పాటు చేశారు. జిల్లా కార్యాలయంతోపాటు ఏడీ కార్యాలయాన్ని కూడా ఇక్కడే నిర్వహిస్తున్నారు. పాడేరు కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటై రెండేళ్లు కావస్తున్నదని, వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయం నూతన భవన నిర్మాణ పనులు పూర్తి చేయించినట్టయితే జిల్లా కార్యాలయాన్ని కూడా ఈ భవనంలోనే ఏర్పాటు చేసుకునే వీలుండేదని అధికారులు, సిబ్బంది అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి సొంత వసతి సమకూర్చేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

మన్యంలో తగ్గని చలి

జి.మాడుగులలో 6.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

- దట్టంగా కురుస్తున్న పొగమంచు

పాడేరు/ చింతపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు అత్యల్పంగానే కొనసాగుతుండడంతో చలి తీవ్రత తగ్గడం లేదు. శుక్రవారం జి.మాడుగులలో 6.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అరకులోయలో 7.4 డిగ్రీలు, జీకేవీధిలో 7.7, పాడేరులో 7.8, చింతపల్లిలో 7.9, పెదబయలులో 9.8, ముంచంగిపుట్టులో 10.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా ఉష్ణోగ్రతలు దిగజారుతుండడంతో చలి ప్రభావం కొనసాగుతున్నది. మిట్ట మధ్యాహ్నం తప్ప మిగిలిన సమయాల్లో చలి తీవ్రత అధికంగా ఉంటున్నది. అయితే జిల్లా కేంద్రం పాడేరు, పరిసర ప్రాంతాల్లో మూడు రోజుల నుంచి పొగమంచు జాడలేదు. ఉదయం ఏడు గంటలలోపే సూర్యోదయం అవుతున్నది. ఇదిలావుండగా చింతపల్లి, జీకే వీధి మండలాల్లో మంచు ప్రభావం అధికంగా వుంది. అర్ధరాత్రి నుంచి మరుసటి రోజు ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు దట్టంగా కురుస్తున్నది. పలుచోట్ల రహదారులు వర్షం కురిసినట్టు తడిసిపోయి కనిపిస్తున్నాయి. ఏజెన్సీలో మరో ఐదు రోజుల వరకు ఇదే మాదిరిగా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని చింతపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కాగా చలి అధికంగా వుండడంతో వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బంది పడుతున్నారు.

అచ్యుతాపురంలో నాగబాబు నివాసం

- సిబ్బంది కోసం పక్కనే మరో పది గృహాలు అద్దెకు...
- అనకాపల్లిలో పార్టీ జిల్లా కార్యాలయం
- అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి నాగబాబు పోటీ చేయనున్నారని సమాచారం





అచ్యుతాపురంలో నాగబాబు నివాసం ఉండబోతున్న గృహం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 16: జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని అచ్యుతాపురంలో నివాసం ఉండడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయన అనకాపల్లి ఎంపీ స్థానం నుంచి పోటీ చేస్తారని ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో ఇక్కడ ఇల్లు తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అచ్యుతాపురం నుంచి గాజువాక వెళ్లే రహదారిలో రామన్నపాలెం వద్ద ... మిగతా 8వ పేజీలో

ఎమ్మెల్యే మాటలు.. నీటి మూటలు!

- ఏడాదిన్నర దాటినా మొదలుకాని పనులు
- బండిగెడ్డ వరదలో కొట్టుకుపోయిన భాగ్యలక్ష్మి హామీలు
- కలగానే వంతెనల నిర్మాణం
- యు.చీడిపాలెం, మఠంభీమవరం పంచాయతీల గిరిజనులకు తప్పని ఇక్కట్లు

బండిగెడ్డపై మూడుచోట్ల వంతెనల నిర్మాణానికి రూ.6.85 కోట్లు మంజూరైనట్టు వెల్లడి



వర్షా కాలంలో ఈదులబంద వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న బండిగెడ్డ (ఫైల్ ఫొటో)



గొట్టెలపాడు వద్ద బండిగెడ్డపై వంతెన నిర్మించాల్సి ప్రదేశం (ఫైల్ ఫొటో)

కొయ్యూరు, ఫిబ్రవరి 16:

మండలంలో యు.చీడిపాలెం, మఠంభీమవరం పంచాయతీల పరిధిలోని 30 గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగు పరచడానికి బండిగెడ్డపై వంతెనల నిర్మాణ హామీలు వరదలో కొట్టుకుపోతున్నాయి. దీంతో ఏటా వర్షాకాలంలో గెడ్డ పొంగితే పలు గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. బండిగెడ్డపై గొట్టెలపాడు, ఈదుల బంద గ్రామాల వద్ద వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి చెప్పి నెలలు గడుస్తున్నప్పటికీ పనులు మాత్రం మొదలు కాలేదు.

మండల కేంద్రానికి సుదూరంలో వున్న యు.చీడిపాలెం, మఠంభీమవరం పంచాయతీల పరిధిలోని సుమారు 30 గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించాలంటే మధ్యలో బండిగెడ్డను దాటాలి. ఇక్కడ కల్వర్టులు మాత్రమే వుండడంతో వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే వరద నీటి ప్రవాహంతో కల్వర్టు పూర్తిగా మునిగిపోతుంది. ఒక్కోసారి దీనిపై ఐదారు అడుగుల ఎత్తున వరద నీరు ప్రవహిస్తుంది. అత్యవసర పనుల మీద ఎవరైనా గెడ్డ దాటడానికి సాహసిస్తే.. వరద నీటిలో కొట్టుకుపోవాల్సిందే. గతంలో ఈ తరహా సంఘటనలు జరిగాయని పలు గ్రామాలు గిరిజనులు చెబుతున్నారు. వరద తీవ్రత తగ్గే వరకు ఆయా గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు వుండవు. ప్రాణాపాయ స్థితిలో వున్న రోగులను, పురుటి నొప్పులు వచ్చిన గర్భిణులను ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే వీలుకాని పరిస్థితి నెలకొంటుంది. బండిగెడ్డపై ఆయా ప్రదేశాల్లో వంతెనలు నిర్మించాలని పలు గ్రామాల ప్రజలు చాలా ఏళ్ల నుంచి పాలకులను, అధికారులను కోరుతున్నారు. 2021 జూలైలో ఈ ప్రాంతంలో పర్యటించిన అరకు ఎంపీ జి.మాధవి, బండిగెడ్డపై వంతెనల నిర్మాణానికి సంబంధిత ఇంజనీరింగ్ విభాగం ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేలా చర్యలు చేపట్టారు. తరువాత 2022 జూలైలో పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి.. యు.చీడిపాలెం, మఠంభీమవరం పంచాయతీల్లో పర్యటించి గొట్టెలపాడు వద్ద వంతెన నిర్మాణానికి రూ.2 కోట్లు, ఈదులబంద వద్ద వంతెన నిర్మాణానికి రూ.2.35 కోట్లు, వేమనపాలెం వద్ద వంతెన నిర్మాణానికి రూ.2.5 కోట్లు మంజూరైనట్టు ప్రకటించారు. ఇది జరిగి సుమారు ఏడాదిన్నర దాటినా వంతెనలు నిర్మాణ పనులు ప్రారంభించలేదు. వంతెనల నిర్మాణానికి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఇచ్చిన హామీలు బండిగెడ్డ వరదలో కొట్టుకుపోయాయని స్థానికులు ఎద్దేవా చేస్తున్నారు.

కాఫీ చెర్రీ ధర పతనం



గొందిపాకలు గ్రామంలో రైతులు ఎండబెట్టిన కాఫీ చెర్రీ

కిలో రూ.120కి ప్రైవేటు వర్తకులు కొనుగోలు

- అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పడిపోయాయంటున్న వ్యాపారులు
- జీసీసీ తేమ శాతం ఆంక్షలతో నష్టపోతున్న గిరిజన రైతులు

చింతపల్లి, ఫిబ్రవరి 16: ప్రాంతీయ మార్కెట్‌లో కాఫీ చెర్రీ ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. శుక్రవారం పెదవలస వారపు సంతలో ప్రైవేటు వర్తకులు కిలో చెర్రీ(గుల్ల) రూ.120కి కొనుగోలు చేశారు. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో కాఫీ చెర్రీ ధర రూ.160 ఉన్నదని కాఫీ బోర్డు అధికారులు చెబుతున్నారు. గత ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల కాఫీ దిగుబడులు భారీగా తగ్గాయి. దీంతో కాఫీ ధరలు ఆశాజనకంగా ఉంటాయని గిరిజన రైతులు భావించారు. సీజన్ ప్రారంభంలో ప్రైవేటు వర్తకులు కాఫీ చెర్రీ కిలో రూ.145-150కు కొనుగోలు చేశారు. తరువాత నుంచి క్రమేపీ తగ్గిస్తున్నారు. శుక్రవారం ధరలను మరింత తగ్గించేయడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కాఫీ ధరలు పడిపోయాయని ప్రైవేటు వర్తకులు ప్రచారం చేస్తూ, తమ నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని వాపోతున్నారు. ఇదిలావుండగా జాతీయ మార్కెట్‌లో కిలో చెర్రీ రూ.160 ఉన్నదని, కాఫీ తాజా ధరల కోసం రైతులు ఫోన్ నంబరు 8037685003కు మిస్డ్ కాల్ ఇస్తే వెంటనే తిరిగి కాల్ వస్తుందని, ఫోన్ రిసీవ్ చేసుకుని '3' అంకెను నొక్కితే ప్రాంతీయ, అంతర్జాతీయ ధరలు తెలియజేయడం జరుగుతుందని కాఫీ బోర్డు అధికారులు చెబుతున్నారు. జాతీయ మార్కెట్‌లో కాఫీ చెర్రీకి మంచి ధర ఉన్నదని, రైతులు ప్రైవేటు వర్తకులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని కాఫీ బోర్డు అధికారులు చెబుతున్నారు.

జీసీసీ నిబంధనలతో...

గిరిజన సహకారం సంస్థ ఆంక్షలతో కాఫీ గింజల అమ్మకానికి రైతులు వెనకడుగు వేస్తున్నారు. కాఫీ చెర్రీకి జీసీసీ రూ.145 ధర చెల్లిస్తున్నది, అయితే తేమ ఆరు శాతం కన్నా తక్కువ ఉంటేనే జీసీసీ సిబ్బంది కొనుగోలు చేస్తున్నారు. సాధారణంగా తేమ 12 శాతం లోపుంటే కొనుగోలు చేయాలి. కానీ జీసీసీ అధికారులు ఆరు శాతాన్ని కొలమానంగా ... మిగతా 8వ పేజీలో



అరకులోయలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక, కర్షక, ఆదివాసీ గిరిజన సంఘాలు

కదంతొక్కిన ఆదివాసీ కార్మికులు, రైతులు

- కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నిరసన ర్యాలీలు

(ఆంధ్రజ్యోతి- న్యూస్ నెట్‌వర్క్)

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదంటూ శుక్రవారం 'పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్'కు అఖిలపక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివాసీ రైతు, కార్మిక సంఘాలు నిరసన ర్యాలీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, రుణమాఫీ అమలు చేయాలని, ఎరువులు, పురుగు మందులను సబ్సిడీపై అందజేయాలని, కార్మికులకు తీవ్ర నష్టం చేకూర్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

గిరిజన విద్యార్థి సంఘం సుమన్ కన్నుమూత

- కిడ్నీ సంబంధ వ్యాధితో బాధపడుతూ రెండు నెలల నుంచి చికిత్స
- పరిస్థితి విషమించడంతో ఆస్పత్రిలో మృతి





సుమన్ భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు. (ఇన్‌సెట్‌లో) బుడిదే సుమన్ (ఫైల్ ఫొటో)

పాడేరురూరల్, ఫిబ్రవరి 16: గిరిజన విద్యార్థి సంఘం (జీఎస్‌యూ) నాయకుడు బుడిదే సుమన్ అనారోగ్యంతో మృతి చెందారు. కిడ్నీ సంబంధ వ్యాధితో బాధపడుతున్న ఆయన రెండు నెలల నుంచి విశాఖలో చికిత్స పొందుతున్నారు. అయినప్పటికీ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శుక్రవారం కన్నుమూశారు. పెదబయలు మండలం బొంగరం పంచాయతీ వంచుర్ల గ్రామానికి చెందిన బుడిదే సుమన్ విద్యార్థిగా వున్నప్పటి నుంచి గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యలపై నిర్వహించే పోరాటంలో చురుకుగా పాల్గొనేవాడు. జీఎస్‌యూలో ప్రధాన భూమిక పోషిస్తూ జేఏసీ నాయకుడిగా ఎదిగాడు. అయితే కిడ్నీ సంబంధ వ్యాధికి గురవడంతో రెండు నెలల నుంచి విశాఖపట్నంలోని ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నాడు. వైద్య ఖర్చుల కోసం గిరిజన యువత వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా సుమారు రూ.4 లక్షల మేర ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

వ్యాన్, కారు ఢీ: నలుగురికి తీవ్ర గాయాలు



రేగుపాలెం జంక్షన్‌లో వ్యాన్, కారు ఢీకొన్న దృశ్యం

ఎలమంచిలి, ఫిబ్రవరి 16: మండలంలోని రేగుపాలెం జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం వ్యాను, కారు ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే రేగుపాలెం జంక్షన్ వద్ద వ్యాన్ అనకాపల్లి వైపు వెళ్లేందుకు యూ టర్న్ తీసుకుంటుండగా అదే సమయంలో అనకాపల్లి నుంచి తుని వైపు ప్రయాణిస్తున్న కారు వెనుక నుంచి వచ్చి వ్యాన్‌ని ఢీకొట్టినట్టు హైవే పోలీసులు తెలిపారు. క్షతగాత్రులు మునగపాక నుంచి కాకినాడ వెళుతుంగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మునగపాక మండలం నాగులాపల్లి గ్రామానికి చెందిన బి.మనోహర్, బి.మూర్తి, బి. తారకేశ్వరావు మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం విశాఖ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో హైవేపై కిలోమీటరు పొడవునా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే హైవే పోలీస్ పెట్రోలింగ్ సిబ్బంది, ఎన్‌హెచ్ 16 సిబ్బంది ట్రాఫిక్‌ను నియంత్రించారు.

12 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, ఫిబ్రవరి 16: పరవాడ గ్రామంలో పాన్‌షాపులో మద్యం అమ్మకాలు సాగిస్తున్న చుక్క దేవిపై శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు. శుక్రవారం రాత్రి సిబ్బందితో తనిఖీ చేయగా 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నిలిచిన పవర్ ప్లాంట్ పనులు

» వైసీపీ వర్గ పోరే కారణం


ప్లాంట్ స్థలం వద్ద వాగ్వాదానికి దిగిన ఇరువర్గాలు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 16: సెజ్‌లో 400 మెగావాట్ల పవర్ ప్లాంట్ పనులు వైసీపీ నాయకుల వర్గపోరు కారణంగా నిలిచిపోయాయి. వివరాల్లోకి వెళ్తే....సెజ్‌లో 400 మెగావాట్ల విద్యుత్ సరఫరా కేంద్రానికి సంబంధించి భూమి చదును పనులు ప్రారంభమయ్యాయి. దీనికి కావలసిన గ్రావెల్ కాంట్రాక్టు పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వర్గానికి రూ.4 కోట్లకు వచ్చింది. వీరు అన్ని అనుమతులతో గ్రావెల్‌తో భూమి చదును చేస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే కన్నబాబు రాజు వర్గీయులు పనులను అడ్డుకుంటున్నారు. సెజ్ పునరావాస కాలనీకి ఆనుకొని పనులు జరుగుతున్నాయి కనుక తమకు కాంట్రాక్టు ఇవ్వాలంటూ పేచీకి దిగారు. బిడ్ వచ్చినందున పనులు చేస్తున్నామంటూ మంత్రి వర్గీయులు పేర్కొంటున్నారు. ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరగడంతో తాత్కాలికంగా పనులు నిలిచిపోయాయి.

అప్పన్న సన్నిధిలో వైభవంగా సూర్య జయంతి

సింహాచలం, ఫిబ్రవరి 16: వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో సూర్య జయంతిని శుక్రవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ఆలయంలో ఈశాన్య దిక్కున బేడా మండపంలో రాతి రథంపై అధిష్ఠింపజేశారు. స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో అర్చకులు ఉత్సవానికి శ్రీకారం చుట్టారు. పండితులు అరుణ పారాయణం చేస్తుండగా పంచామృతాలతో, పవిత్ర గంగధార జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని సర్వ స్వర్ణాభరణాలతో, పలు పరిమళభరిత పుష్పమాలికలతో అలంకరించి మంత్రపుష్పం, మంగళాశాసనం, మంగళనీరాజనాలతో ఉత్సవం పూర్తి చేశారు. సాయంత్రం 5 గంటలకు గోవిందరాజస్వామిని సూర్యభగవానుడిగా ఉషా, ఛాయదేవి సమేతంగా వాహనంపై మాడవీధుల్లో తిరువీధి వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసమూర్తి, ఏఈఓ భ్రమరాంబ, పాలకమండలి పాల్గొన్నారు.

రాజధాని ఫైల్స్ సినిమా విజయం సాధించింది

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు


మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : రాజధాని ఫైల్స్ సినిమా విషయంలో ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా కోర్టు తీర్పుతో పటాపంచలు అయ్యాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు చెప్పారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధాని విషయంలో జగన్‌రెడ్డి చేసిన విష ప్రచారం, అమరావతి విధ్వంసాన్ని కళ్లకు కట్టినట్టు సినిమాలో చూపించారన్నారు. ప్రభుత్వ టెర్రరిజం చేసిన విధ్వంసం ఈ సినిమా ద్వారా అందరికీ చేరుతుందన్నారు. వేల కోట్ల ప్రభుత్వ సంపదను ఒక సైకో ఎలా నాశనం చేశాడో.. మహిళలు, రైతుల పట్ల ఎంత దారుణంగా వ్యవహరించాడోనన్న నిజాలు ఈ సినిమా ద్వారా ప్రజల్లోకి వెళతాయని చెప్పారు. దీంతో జగన్‌రెడ్డి వెన్నులో వణుకు మొదలైందన్నారు. సినిమాపై తప్పుడు ఆరోపణలతో సొంత పార్టీ నేతల ద్వారా కేసులు వేయించారని, అడుగడుగున సినిమాను అడ్డుకునేందుకు కుట్రలు చేశారని ఆరోపించారు. అయితే చివరకు న్యాయమే గెలిచిందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోట్ని రామకృష్ణ, మళ్ల గణేష్ పాల్గొన్నారు.

ఎస్‌బీ డీఎస్పీగా అప్పారావు బాధ్యతల స్వీకారం

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 16 : జిల్లా స్పెషల్ బ్రాంచి డీఎస్పీగా బి. అప్పారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటివరకు రాజమండ్రి ఎస్‌బీ డీఎస్పీగా పనిచేసి జిల్లాకు వచ్చారు. అనంతరం జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణను జిల్లా పోలీస్ కార్యాలయంలోని మర్యాదపూర్వకంగా కలిశారు.

పోలీస్ ఉద్యోగులకు గ్రీవెన్స్

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 16 : జిల్లాలో పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగులకు గ్రీవెన్స్ నిర్వహించారు. క్రైమ్స్ ఏఎస్పీ సత్యనారాయణ హాజరై ఉద్యోగుల నుంచి వినతులను స్వీకరించారు. అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలపై ఉద్యోగులు తమ గోడును వెళ్లబుచ్చుకోగా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఏఎస్పీ సత్యనారాయణ హామీ ఇచ్చారు.

స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

అనకాపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : భారతీయ స్టేట్‌బ్యాంక్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని గ్రామీణాభివృద్ధి ఫైనాన్షియల్ అడ్వయిజర్ అండ్ జాయింట్ సెక్రటరీ తనూజా రాఖూర్ ఖల్‌కో పేర్కొన్నారు. శుక్రవారం అనకాపల్లిలో నిర్వహిస్తున్న ఉపాధి శిక్షణ కేంద్రాన్ని ఆమె పరిశీలించి, అభ్యర్థులతో మాట్లాడారు. శిక్షణ కేంద్రంలో వసతి, భోజన సదుపాయాలు గురించి ఆరా తీశారు. శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వశక్తితో మహిళలంతా అభివృద్ధికి రావాలన్నదే సంస్థ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో విశాఖ ఉమ్మడి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్లు నటరాజన్సై, విశ్వనాథరెడ్డి, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

నిరుపయోగంగా జాజిగెడ్డ గ్రోయిన్

» ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునేవారు కరువు

» ప్రశ్నార్థకంగా మారిన 400 ఎకరాలకు సాగు


తూటిపాలలో మరమ్మతుకు గురైన గ్రోయిన్

మాకవరపాలెం, ఫిబ్రవరి 16: మండలంలోని తూటిపాల పంచాయతీ పరిధి జాజిగెడ్డ వద్ద గ్రోయిన్ నిరుపయోగంగా మారింది. ఇది మరమ్మతుకు గురై ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. దీంతో సుమారు 400 ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. గత నాలుగేళ్లుగా వరి సాగు చేస్తున్నప్పటికీ పొలాలకు నీరు అందకపోవడంతో పంట సరిగా పండక నష్టాలను చవిచూస్తున్నామని పలువురు రైతులు వాపోతున్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న బోళం ముత్యాల పాప వద్ద రైతులు ఈ సమస్యను ప్రస్తావించడంతో ఆమె నిధులను మంజూరు చేయించి గ్రోయిన్ నిర్మాణానికి కృషి చేశారు. ఆ తరువాత వచ్చిన వరదలకు అది కొట్టుకుపోయింది. నాటి నుంచి నేటి వరకు ప్రజాప్రతినిధులతో పాటు అధికారులను రైతులు కలిసి మరమ్మతులు చేపట్టాలని వేడుకుంటున్నా కన్నెత్తి చూసేవారు కరువయ్యారు. ఇదిలావుంటే, స్థానిక వైసీపీ నాయకులు ఎమ్మెల్యే గణేశ్ ద్వారా అనకాపల్లి ఎంపీ సత్యవతి దృష్టికి గత ఏడాది ఈ సమస్యను తీసుకు వెళ్లారు. గ్రోయిన్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని వేడుకున్నారు. గత ఏడాది నీటి సదుపాయం లేక వరిపంట పూర్తిగా ఎండిపోయి నష్టపోయామని రైతులు వివరించారు. ఇప్పటికైనా ఈ సమస్యపై ఎమ్మెల్యే గణేశ్ స్పందించాల్సిందిగా ఆయకట్టు రైతులంతా కోరుతున్నారు. ఈ సమస్యపై ఇరిగేషన్ జేఈ రవికుమార్‌ను వివరణ కోరగా, ప్రస్తుతం ఎంపీ సత్యవతి గ్రోయిన్ మరమ్మతుకు రూ.30లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

ఏరియా ఆస్పత్రిలో ఓపీ విభాగం ప్రారంభం


ఓపీ విభాగాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, ఫిబ్రవరి 16 : పట్టణంలోని ప్రాంతీయ ఆస్పత్రిలో శుక్రవారం ఓపీ విభాగం ప్రారంభమైంది. ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేశ్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇక్కడ ప్రత్యేకంగా ఓపీ విభాగం కోసం రూ.8.8 కోట్లతో భవనాన్ని నిర్మించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. మునిసిపల్ ఛైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, నాలుగు మండలాల ఎంపీపీలు సుర్లరాజేశ్వరి, రుత్తల సత్యనారాయణ, గజ్జలపు మణికుమారి, సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఛైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడులు మిగిలిన ప్రత్యేక వైద్య విభాగాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణిదేవి తదితరులు పాల్గొన్నారు.

20 నిమిషాల్లోనే మునిసిపల్ సమావేశం ముగింపు


మునిసిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ రమాకుమారి

» 21 అంశాలపై తీర్మానాలు ఆమోదం

» కొమ్మాయి గుండం చెరువుకు సత్యంరాజు పేరు, సన్యాసమ్మ చెరువుకు తులసీరావు వనంగా నామకరణం

ఎలమంచిలి, ఫిబ్రవరి 16: ఎలమంచిలి మునిసిపల్ సమావేశాన్ని శుక్రవారం 20 నిమిషాల్లోనే ముగించేశారు. అజెండాలో 21 అంశాలు పొందుపరిచినప్పటికీ వీటిపై ఎటువంటి చర్చ కొనసాగించలేదు. ఈ అంశాలపై తీర్మానం చేసినట్టు ప్రకటించారు. కౌన్సిల్ సమావేశంలో ఛైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. కీర్తిశేషులు పిన్నమరాజు సత్యనారాయణరాజు(సత్యం రాజు) అందించిన సేవలకు గుర్తింపుగా కొమ్మాయి గుండం చెరువును రూ.86 లక్షలతో అభివృద్ధి చేస్తున్నామని, ఈ చెరువుకు సత్యనారాయణరాజు పెడుతున్నట్టు ఛైర్‌పర్సన్ ప్రకటించారు. అలాగే విశాఖ డెయిరీ దివంగత ఛైర్మన్ ఆడారి తులసీరావు సేవలకు గుర్తింపుగా సన్యాసమ్మ చెరువు ప్రాంతంలో డెయిరీ నిధులతో అభివృద్ధి చేసే ప్రాంతాన్ని తులసీరావు వనంగా నామకరణం చేసేందుకు తీర్మానం చేశారు. అలాగే కొత్తపాలెం కౌన్సిలర్ సంతోష్, గొల్లలపాలెం కౌన్సిలర్ అచ్యుతరావు విద్యుత్ మీటర్లు, తదితర సమస్యలను కౌన్సిల్ ముందుంచారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఛైర్‌పర్సన్ రమాకుమారి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రభాకరరావు, మునిసిపల్ వైస్ ఛైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, డీఈఈ వీరయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, టీపీవో శ్రీలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉప్పుటేరుకు ప్యాకేజీ ఇవ్వాలి

» ఏపీఐఐసీ అధికారులకు మత్స్యకారుల వినతి


అధికారులకు వినతిపత్రం అందిస్తున్న మత్స్యకారులు

నక్కపల్లి, ఫిబ్రవరి 16: విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో జీవనాధారమైన ఉప్పుటేరులో చేపల వేట సాగించడం కష్టమని, అందువల్ల పూర్తి స్థాయిలో పరిహారం, ఆర్ఆర్ ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలని రాజయ్యపేట మత్స్యకారులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాజయ్యపేటలో ఏపీఐఐసీ భూసేకరణ డీటీ టీవీఎల్ రాజు, డీటీ కిరణ్ తదితరుల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాసిత మత్స్యకారులు, రైతులు తమ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. 2013 భూసేకరణ చట్టం భూములిచ్చిన రైతులకు పరిహారం, ప్యాకేజీ ఇవ్వాలని, ఉప్పుటేరులో చేపల వేట సాగించే మత్స్యకారులకు ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. గత 50 సంవత్సరాలుగా గ్రామంలో జీడితోటలను సాగు చేసుకుంటున్న వారికి కూడా పరిహారం, ప్యాకేజీ ఇవ్వాలంటూ వినతిపత్రం అందజేశారు. చేపల వేటకు సంబంధించి జెట్టీ ఏర్పాటు చేయాలని, టెన్త్ చదివిన విద్యార్థులందరికీ నెలకు రూ.18 వేలు జీతం ఇవ్వాలన్నారు. పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే బల్క్ డ్రగ్, ఫార్మా, రసాయన పరిశ్రమలను ఏర్పాటు చేయకూడదని డిమాండ్ చేశారు. జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, సీపీఎం నేత అప్పలరాజు, గ్రామ పూజారులు పిక్కి దేవుడు, తాతీలు, ఎంపీటీసీ సభ్యుడు సత్తియ్య, పిక్కి గంగరాజు, పిక్కి కోదండరావు, వాసుపల్లి శివ, మైలపల్లి ప్రసాద్, రాజేశ్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు ముందస్తు చర్యలు

» జిల్లా ఎన్నికల నిర్వహణాధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి ఎస్పీ కేవీ మురళీకృష్ణ తదితరులు

అనకాపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు చర్యలను చేపట్టడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌తో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జిల్లా ఎస్పీ కేవీ.మురళీకృష్ణతో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చేపట్టిన చర్యలను వివరించారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాలను అన్ని మౌలిక వసతులతో సిద్ధం చేశామని, నిర్వహణకు అవసరమైన అధికారులు సిబ్బందిని సమాయత్తం చేయడం జరిగిందని చెప్పారు. జిల్లాలోని సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా తగిన కమ్యూనికేషన్ ప్లాన్ సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అధికారులు, సిబ్బంది, పోలీసు సిబ్బంది, వాహనాలు గస్తీ సిబ్బంది మొదలైన వాటిని క్షుణ్ణంగా పరిశీలించి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్టు చెప్పారు. ఈవీఎంలపై ఓటింగ్ ఏ విధంగా చేయాలనే శిక్షణ కార్యక్రమాలు కూడా విస్తృతంగా జరుగుతున్నాయన్నారు. వివాదాలు జరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్, సీపీఓ జి.రామారావు, నర్సీపట్నం ఆర్డీఓ హెచ్‌వీ జయరాం, నర్సీపట్నం, పాయకరావుపేట, ఎలమంచిలి, అనకాపల్లి, చోడవరం, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్వోలు, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు డి.రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ'కి బడ్జెట్ కేటాయింపులు పెంచాలి

» సీఎఫ్‌టీయూఐ జాతీయ అధ్యక్షుడు కనకారావు



రాజాం గ్రామంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న కనకారావు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 16: ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ కేటాయింపులను రూ.రెండు లక్షల కోట్లకు పెంచాలని సీఎఫ్‌టీయూఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం చేపట్టిన దేశవ్యాప్త గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా మండలంలోని రాజాం గ్రామంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతోందని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నానాటికీ పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం, ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ, కార్మిక చట్టాలు అమలుకు నోచుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమనాథ్ సిఫార్సులను తూ.చ. తప్పకుండా అమలు చేయాలని, ఉపాధి హామీ పథకంలో రోజు కూలీ రూ.600లు ఇవ్వాలని, రెండు వందల రోజుల పనిదినాలు కల్పించాలని, ప్రభుత్వ పరిశ్రమలను ప్రైవేటుపరం చేయకూడదని, అసంఘటిత కార్మికులకు సోషల్ సెక్యూరిటీ కల్పించాలని ఆయన కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆందోళనలో భాగంగా తొలుత స్థానికంగా దుకాణాలు, పాఠశాలలు, వాణిజ్య బ్యాంకులను మూసివేయించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సీఐఎఫ్‌టీయూఐ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు నాగులాపల్లి సత్యనారాయణ, జిల్లా నాయకులు మరిసా సతీష్, నరేష్, నవభారత భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మరిసా నాగ అప్పారావు, ఎల్.శ్రీను, వ్యవసాయకూలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

శంఖారావం సభను విజయవంతం చేయాలి

» తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగపూడి అనిత


నియోజకవర్గం టీడీపీ సమావేశంలో మాట్లాడుతున్న అనిత

నక్కపల్లి, ఫిబ్రవరి 16: ఈనెల 20న కోటవురట్లలో జరగనున్న నారా లోకేశ్ ఎన్నికల శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత కోరారు. శుక్రవారం ఆమె నివాసం వద్ద నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామాల నుంచి ఐటీడీపీ, తెలుగు మహిళ, యువత, బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, ప్రజాప్రతినిధులు, నాయకులంతా హాజరుకావాలని పిలుపునిచ్చారు. యువగళం పాదయాత్రను నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు విజయవంతం చేసినట్టే శంఖారావాన్ని కూడా విజయవంతం చేయాలని కోరారు. నియోజకవర్గంలో అపరిష్కృతంగా వున్న ప్రధాన సమస్యలపై లోకేశ్‌కు వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో నియోజకవర్గం టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, అమలకంటి అబద్దం, జానకి శ్రీను, పెదిరెడ్డి చిట్టిబాబు, లాలం కాశీనాయుడు, ఏజెర్ల వినోద్‌రాజు, కొప్పిశెట్టి కొండబాబు, కొప్పిశెట్టి బుజ్జి, గొర్లి రాజబాబు, మజ్జూరి నారాయణరావు, గుర్రం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెంలో కన్నుల పండువగా రథసప్తమి వేడుకలు


ఆలయం ముందు తప్పెటగుళ్లు వేస్తున్న దృశ్యం

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 16: జిల్లాలోని ప్రసిద్ధి చెందిన రాజుపాలెం సూర్యనారాయణమూర్తి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. స్వామివారిని దర్శించుకోవడానికి వేకువజామున మూడు గంటల నుంచి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. ఆలయ ప్రధాన అర్చకులు కళ్యాణ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు మజ్జిగ, వాటర్ ప్యాకెట్, ప్రసాదం భక్తులకు అందజేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమానికి అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం టేకు రథంపై స్వామివారిని మేళతాళాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన పార్టీ నాయకులు పరుచూరి భాస్కరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ నాయకులు మళ్ల సురేంద్ర పాల్గొన్నారు.

కొణతాలతో నాగబాబు భేటి



అనకాపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణెదల నాగబాబు శుక్రవారం విశాఖలో మాజీమంత్రి కొణతాల రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర రాజకీయాలపై చర్చించినట్టు సమాచారం. నాగబాబు అనకాపల్లి టీడీపీ, జనసేన ఉమ్మడి ఎంపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉంటారన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఇద్దరూ నేతల భేటి ప్రాధాన్యతను సంతరించుకుంది.

నోటీసులతో ఉద్యమాలు ఆపలేరు

» యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రకాష్

అచ్యుతాపురం రూరల్, ఫిబ్రవరి 16: ప్రజాస్వామ్యంగా చేస్తున్న ఆందోళనకు వెళ్లకూడదని నోటీసులు జారీ చేయడం వల్ల తమ ఉద్యమాలు ఆపలేరని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జీఎస్ ప్రకాష్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటాచలం పాఠశాలకు వచ్చి తనకు పోలీసులు నోటీసులు అందించడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, రాష్ట్ర కౌన్సిలర్ మారిశెట్టి వెంకట అప్పారావు, నాయకులు మహిమా రావు, నానాజీ, సుభాషిణీ దేవీలకు పోలీసులు అప్రజాస్వామికంగా నోటీసులు ఇచ్చారన్నారు. జీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని జరిగే కార్యక్రమాలను ప్రభుత్వం నిరంకుశంగా అడ్డుకుంటుందన్నారు. సీఎం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

విశాఖలో ఐపీఎల్ మ్యాచ్‌లు?

» ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్ ఆసక్తి

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 16: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో కొన్ని మ్యాచ్‌లకు విశాఖ ఆతిథ్యమిచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభం కానున్న ఐపీఎల్ టోర్నీలో భాగంగా పీఎం పాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదికగా రెండు లేదా మూడు మ్యాచ్‌లు జరిగే సూచనలు ఉన్నాయి. ఇక్కడ ఆడేందుకు ఢిల్లీ క్యాపిటల్స్ చెన్నై సూపర్ కింగ్స్ జట్లు ఆసక్తి చూపుతున్నట్టు తెలిసింది. ఇటీవల భారత్, ఇంగ్లండ్ మధ్య జరిగిన టెస్ట్ మ్యాచ్‌కు ముందు ఢిల్లీ క్యాపిటల్స్ యంత్రాంగం ఏసీఏ-వీడీసీఏ స్టేడియాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. తొలుత కేవలం ప్రాక్టీస్‌కు మాత్రమే వినియోగించుకోవడానికి ఆసక్తి చూపిన ఢిల్లీ క్యాపిటల్స్ ప్రతినిధులు ఇక్కడి సదుపాయాలు చూసి మ్యాచ్‌లు ఆడాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఆడే రెండు మ్యాచ్‌లకు పీఎం పాలెం స్టేడియం వేదికగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే చెన్నై సూపర్‌కింగ్స్ కూడా ఇక్కడ మ్యాచ్‌లు ఆడేందుకు ఆసక్తి చూపుతోందని సమాచారం. ఐపీఎల్ షెడ్యూల్ ఒకటి, రెండు రోజుల్లో ఖరారు కానుంది. కాగా 2012లో డెక్కన్ చార్జర్స్, 2015లో సన్‌రైజర్స్ హైదరాబాద్, 2016లో ముంబై ఇండియన్స్ జట్లు ఆడిన మ్యాచ్‌లకు ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదికగా నిలిచింది.

బీజేపీని గద్దె దించితేనే దేశానికి మేలు

» సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్యపడాల్

» మన్యంలో కార్మికులు, రైతుల బంద్ ప్రశాంతం

పాడేరు రూరల్, ఫిబ్రవరి 16: దేశంలో కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గద్దె దించితేనే దేశానికి, రాష్ట్రానికి మేలు జరుగుతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం కార్మిక, కర్షక, రైతు సంఘాలు శుక్రవారం చేపట్టిన గ్రామీణ భారత్ బంద్ విజయవంతమైంది. పాడేరు సీఐటీయూ కార్యాలయం నుంచి సినిమా హాలు సెంటర్ మీదుగా పీటీడీ కాంప్లెక్స్ వరకు ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం అక్కడ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తున్నదన్నారు. కార్పొరేట్ కంపెనీలకు అమ్ముడుపోయిన మోదీ, ఆయా కంపెనీల లాభాలకు అడ్డంకిగా ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేసి అన్యాయం చేశారని ఆరోపించారు. కార్పొరేట్ కంపెనీలకు రాయితీలను ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం, సామాన్య ప్రజలు వినియోగించే నిత్యావసర వస్తువుల ధరలను పెంచేసి ఇబ్బందులకు గురి చేస్తున్నదన్నారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ అమర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు ఎల్.సుందరరావు, చిన్నారి, ఇందిర, జల్లి రాజుబాబు, టి.కృష్ణారావు, సంజీవరావు, ప్రసాద్, మంగమ్మ, పార్వతమ్మ, రాజు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

అరకులోయలో...

అరకులోయ: గ్రామీణ బంద్ సందర్భంగా అరకు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. దేశ వ్యాప్త పారిశ్రామిక, గ్రామీణ బంద్ సందర్భంగా అరకు సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులంతా నిరసన ర్యాలీలు చేపట్టారు. అనంతరం నాలుగ రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్ట జీవులకు వ్యతిరేకంగా బీజేపీ ప్రభుత్వం పనిచేస్తున్నదని, వారిని అడుగడుగునా ఇబ్బందులకు గురి చేస్తున్నదని ఆరోపించారు. మోటారు కార్మికులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని, స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల కార్మికులు, రైతులు, అధిక సంఖ్యలో మోటారు కార్మికులు పాల్గొన్నారు.





పాడేరు ప్రధాన రహదారిపై నిరసన కార్యక్రమం చేపడుతున్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు... చింతపల్లి ప్రధాన రహదారిపై రాస్తారోకో

చింతపల్లిలో...

చింతపల్లి: బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను గిరిజనులు ఓటుతో తిప్పికొట్టాలని సీఐటీయూ జిల్లా నాయకుడు పాంగి ధనుంజయ్ పిలుపునిచ్చారు. భారత్ గ్రామీణ బంద్ పురస్కరించుకుని మండ కేంద్రంలో సీఐటీయూ నాయకులు, గిరిజన రైతులు, కార్మికులు శుక్రవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రజారంగ పరిశ్రమలు, గనులు, అటవీ సంపద, ఎల్ఐసీ, బ్యాంక్, ఎల్ఐసీ, పోర్టులను అదానికి కట్టబెడుతున్నాడన్నారు. బడా కార్పొరేటు కంపెనీలకు రూ.కోట్లు రాయితీలు ఇస్తున్నారన్నారు. రూ.లక్షల కోట్ల ప్రజాధనాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం మోదీ దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ప్రజలు బీజేపీ విధానాలను ఎండగట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సాగిన చిరంజీవి, చిరంజీవి, చిన్నరావు, కిల్లో సింహాచలం, మజ్జి రాంబాబు, కార్మిక సంఘాల నాయకులు లక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో...

ముంచంగిపుట్టు: కార్మిక చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని గిరిజన సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం ఆందోళన బాట పట్టారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసిస్తూ కార్మిక, కర్షక, రైతు భారత్ గ్రామీణ సమ్మె సందర్భంగా నాలుగు రోడ్ల కూడలిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక, రైతులకు వ్యతిరేకంగా అవలంబిస్తున్న విధానాలు కారణంగా తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కె.త్రినాథ్, కె.శంకరరావు, ఎం.ఎం.శ్రీను, కె.నర్సయ్య, పి.రామదాసు, కె.డంబ్రు తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో...

డుంబ్రిగుడ: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను, మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో రైతులు చేపడుతున్న భారత్ గ్రామీణ బంద్‌కు మద్దతుగా స్థానిక మండల కేంద్రంలో సీఐయాటీ నాయకులు శుక్రవారం రాస్తారోకో నిర్వాహించారు. కార్పొరేట్లకు దోచిపెడుతున్న బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌టీ పోతురాజు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడు పి.సత్యనారయణ, గిరిజనులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర

టీడీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధం

» పార్టీ అరకు నియోజకవర్గం ఇంచార్జ్ దొన్నుదొర

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 16: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ పాలనలో అరాచకం తప్పా అభివృద్ధి శూన్యమన్నారు. ఏ గ్రామాన్ని సందర్శించినా సమస్యలు దర్శనమిస్తున్నాయన్నారు. దీంతో ఆ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించడంతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం మండలంలోని కరిముఖిపుట్టు పంచాయతీ నందిమెట్ట గ్రామంలో నిర్వహించిన బాబు షూరిటీ భవిష్యతు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గడ్డంగి రామ్మూర్తి, ఆర్గనైజింగ్ జిల్లా కార్యదర్శి ఎ.తిరుపతిరావు, మండల అధ్యక్షుడు కె.బలరాం, సర్పంచ్‌లు వి.లక్ష్మణ్, కె.శివశంకర్, నాయకులు వి.రామస్వామి, ఆర్.కొండలరావు, కామేశ్వరరావు, శంకర్‌నాయుడు, ఎన్.శంకరావు, ఎం.చిన్నబాబు, ఎస్.పద్మనాభం, ప్రకాష్, లక్ష్మణ్, గోపాల్‌రాజు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



స్వామివారి దర్శనానికి శోభ యాత్రగా ఆలయానికి వచ్చిన భక్తులు... (ఇన్‌సెట్‌లో) పూజలు అందుకున్న స్వామివారు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 16: మండలంలోని డి.గొందూరు పంచాయతీ సూకురుపుట్టు గ్రామంలో రథసప్తమి ముగింపు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సూర్యనారాయణస్వామి దేవాలయ ధర్మకర్త, విశ్వహిందూపరిషత్ జిల్లా కార్యదర్శి, గిరిజన అర్చకుల సంఘం అధ్యక్షుడు కూడ రామకృష్ణ పరమహంస అధ్యక్షతన మూడు రోజులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సూర్య హోమం, సూర్య నారాయణస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. రామకృష్ణ పరమహంస రథసప్తమి ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. సూర్య మాల దీక్ష స్వాముల సోభయాత్రను ఇరుముడులతో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. మన్యం, మైదాన ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు హాజరై స్వామివారి దర్శనం చేసుకొని సూర్య భగవానునికి ఘనంగా పూజలు చేపట్టారు.

యువత క్రీడల్లో రాణించాలి: ఏఎస్పీ ధీరజ్



వాలీబాల్ విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఏఎస్పీ ధీరజ్

జి.మాడుగుల, ఫిబ్రవరి 16: గిరిజన యువత క్రీడల్లో రాణించాలని పాడేరు ఏఎస్పీ ధీరజ్ సూచించారు. ఏవోబీ ప్రాంతామైన బొయితిలి పంచాయతీ సూమెట్టలో యువహో మెగా వాలీబాల్ పోటీలు శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదవు, క్రీడల్లో ఆసక్తి కనబరచాలని సూచించారు. ఈ పోటీల్లో విశేషంగా 59 జట్లు పాల్గొనగా, మొదటి స్థానంలో పెదబయలు మండలం లింగేరిపుట్టు నిలిచింది. రెండోస్థానంలో జి.మాడుగుల మండలం ఏగమండిబ, కాగా మూడో స్థానంలో ఇనప తీగలు జట్లు గెలుపొందాయి. విజేతలకు ఏఎస్పీ చేతులు మీదుగా షీల్డుతో పాటు నగదును ప్రదానం చేశారు. అంతకుముందు జి.మాడుగుల నుంచి మద్దిగరువు వరకు ఉచితంగా నడిపే ఆర్టీసీ సేవలను బొయితిలి వరకు బస్సు నడపడానికి ఏఎస్పీ ధీరజ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐ రమేశ్, ఎస్ఐ శ్రీనివాసరావు, సర్పంచ్ ఎల్.మాలన్న, ఎంపీటీసీ సభ్యుడు ఎల్. అప్పలరాజు తదిరులు పాల్గొన్నారు.

రాజధాని ఫైల్స్ సినిమాతో జగన్‌లో వణుకు

» టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, పక్కన నాయకులు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 16: రాజధాని ఫైల్స్ సినిమాతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వెన్నులో వణుకు పుడుతున్నదని తెలుగుదేశం పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సినిమా చూసి ముఖ్యమంత్రి భయపడటం ఇదే తొలిశారన్నారు. రైతుల బతుకులపై తీసిన సినిమాను అడ్డుకొనే నీచ స్థితికి జగన్ ప్రభుత్వం దిగజారిందన్నారు. సామాజిక బాధ్యతతో సినిమా తీస్తే జగన్‌రెడ్డికి వచ్చిన నష్టం ఏముందని ఆమె ప్రశ్నించారు. రాజధాని ఫైల్స్ సినిమాను చూసే ప్రజల్లో మరింత చైతన్యం వచ్చి వైసీపీ ప్రభుత్వాన్ని మరింతగా వ్యతిరేకిస్తారన్న భయంతోనే వైసీపీ కోర్టుకు వెళ్లిందన్నారు. 34 వేల మంది రైతుల త్యాగాలకు వాస్తవ రూపంగా నిలిచిన చిత్రం రాజధాని ఫైల్స్ అన్నారు. వేల మంది రైతుల త్యాగాలను బూడిదలో పోసిన పన్నీరును చేశారు సైకో సీఎం జగన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిననాటి నుంచి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేపట్టిన అరాచకాలను ప్రజల కళ్లకు కట్టినట్టు అద్భుతంగా చిత్రీకరించినదే రాజధాని ఫైల్స్ అన్నారు. అసెంబ్లీ సాక్షిగా అమరావతి రాజధానికి మద్దతు తెలిపిన జగన్‌రెడ్డి, తాను సీఎం అయ్యాక మూడు రాజధానుల పేరుతో మాటమార్చి మడం తిప్పారన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి లభిస్తున్న ప్రజాదరణ చూసి జగన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందన్నారు. మూడు రాజధానుల పేరుతో ఏపీని జగన్ అండ్ కో నిలువుదోపిడి చేశారన్నారు. దేశంలోనే రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలబెట్టిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదే అన్నారు. జగన్ సర్కార్‌పై టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ విడుదల చేసిన పుస్తకాన్ని అందరూ చదవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేవీ.సురేష్‌కుమార్, జి.శివకుమార్, డి.వెంకటరమణ, జి.సింహాచలం, కె.పూర్ణ చందరరావు, జి.సత్యనారాయణ, కోటిబాబు, స్వర్ణలత పాల్గొన్నారు.

దోచుకోవడం.. దాచుకోవడమే.. అభివృద్ధి లేదు

» బాబు ష్యూరిటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, ఫిబ్రవరి 16: వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఆదాయాన్ని దోచుకోవడం..దాచుకోవడం తప్ప జగన్‌రెడ్డి రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధిని చేసింది లేదని తెలుగుదేశం పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. మండలంలోని తుంపాడ పంచాయతీ బయలువీధి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో గిరిజన గ్రామాలు అభివృద్ధిలో ఆమడ దూరానికి పోయాయన్నారు. ఈ పరిస్థితి మారాలంటే మరలా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ఆమె పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటనే ఆయుధంతో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. ఇప్పటికే జగన్‌కు ఓటమి భయం పట్టుకోవడంతో పార్టీ ఇన్‌చార్జులను మారుస్తున్నారని ఆమె ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేవీ.సురేష్‌కుమార్, జి.సింహాచలం, డి.వెంకటరమణ, కోటిబాబు, కర్రి దొర, రవి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు రమేష్‌నాయుడు

చంద్రబాబును సీఎంను చేద్దాం..

రానున్న ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసి గిరిజన హక్కులను మనం కాపాడుకుందామని టీడీపీ నేత కేవీ రమేష్‌నాయుడు పిలుపునిచ్చారు. వంతాడపల్లి పంచాయతీ అల్లివరం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైసీపీ ఐదేళ్ల పాలనలో జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన అరాచకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును సీఎం చేస్తే అమలుచేసే సూపర్-6 పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కాగా, అల్లివరం గ్రామానికి చెందిన 50 కుటుంబాల వారు టీడీపీ చేరడంతో పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. నాయకులు ఎం.వెంకటేశ్వరరావు, బి.బాలరాజు, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో నిరుద్యోగుల దగా

గూడెంకొత్తవీధి: వైసీపీ ప్రభుత్వం మెగా డీఎస్సీ అంటూ నిరుద్యోగులను దగా చేసిందని టీడీపీ నేత కొట్టగుళ్లి సుబ్బారావు అన్నారు. సంకాడ, దామనాపల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన బాబూ ష్యూరిటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోగా, ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో దగా డీఎస్సీకి సీఎం జగన్ తెర తీశారన్నారు. వైసీపీ ప్రభుత్వం జీవో నంబరు-3 పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోకపోవడంతో ఆదివాసీలకు ఉపాధి లేకపోయిందన్నారు. మరోసారి జగన్‌కు ఓటు వేస్తే గిరిజన యువతకు ఉద్యోగాలు లభించక కూలి కోసం వలస వెళ్లిపోవాల్సి వస్తుందన్నారు. ప్రజలు చైతన్యంతో టీడీపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగేంద్ర, నూకరత్నం, ముక్కలి మహేశ్, ఎం.లక్ష్మణరావు, కల్యాణి పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో నాగబాబు నివాసం

... 5వ పేజీ తరువాయి

ఎస్‌టీబీఎల్ లేఅవుట్ ఉంది. దీనిని ఆనుకొని జనసేన పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయకుమార్ ఇటీవల నూతనంగా గృహాన్ని నిర్మించుకున్నారు. ఈ భవనం కింద భాగంలో నాగబాబు నివాసం ఉండడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేకాకుండా ఎస్‌టీబీఎల్ లేఅవుట్‌లో సుమారు పది గృహాలను అద్దెకు తీసుకున్నారు. ఎన్నికల కార్యకలాపాలన్నీ అచ్యుతాపురం కేంద్రంగా నిర్వహించాలన్న ఉద్దేశంతోనే నాగబాబుతోపాటు ఇతర సిబ్బంది ఉండడానికి పది ఇళ్లను అద్దెకు తీసుకున్నట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. కాగా జనసేన పార్టీ జిల్లా కార్యాలయం ఏర్పాటుకు అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఒక భవనాన్ని ఎంపిక చేశారు. ఈ భవన యజమాని చోడవరంలో ఒక విద్యా సంస్థను నిర్వహిస్తున్నారు. కొంతకాలం క్రితం ఆయన జనసేన పార్టీలో చేరారు.

చెర్రీ కాఫీ ధర పతనం

... 5వ పేజీ తరువాయి

తీసుకోవడం వల్ల జీసీసీకి కాఫీ గింజలను విక్రయించుకోలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఏజెన్సీలో కొద్ది రోజుల నుంచి మంచు అధికంగా కురుస్తుండడంతో కాఫీ గింజలను ఎన్ని రోజులు ఎండబెఎట్టినా తేమ శాతం తగ్గడంలేదని అంటున్నారు. జీసీసీ అధికారులు తేమ శాతం విషయంలో ఆంక్షలను సడలించి గిట్టుబాటు ధరకు కాఫీ గింజలు కొనుగోలు చేయాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

బలవంతంగా వైసీపీ కండువాలు వేశారు..

» కడదాక టీడీపీతోనే: గాదిగుంట గ్రామస్థుల వెల్లడి



ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికుల నినాదాలు

జి.మాడుగుల, ఫిబ్రవరి 16: వైసీపీ నేతలు బలవంతంగా ఆ పార్టీ కండువాలు వేశారని, అది నుంచి టీడీపీతోనే ఉంటామని గాదిగుంట గ్రామస్థులు స్పష్టం చేశారు. గురువారం వైసీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి విశ్వేశ్వరరాజు గాదిగుంట సందర్శించి టీడీపీ కంచుకోట నుంచి వైసీపీ తీర్థం పుచ్చుకున్నట్టు ప్రకటించడంతో టీడీపీ మండల అధ్యక్షుడు వంతాల కొండలరావు బృందం శుక్రవారం గాదిగుంటలో పర్యవేక్షించారు. గాదిగుంట గ్రామస్థులు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీతోనే ఉన్నామని, కడదాక టీడీపీతోనే ప్రయాణమని తేల్చి చెప్పారు. అనంతరం కొండలరావు మాట్లాడుతూ, వైసీపీ పాలనలో గిరిజన చట్టాలు, హక్కులు ఆగమమయ్యాయని, ఏ మొహం పెట్టి గిరిజనుల ఓట్లు ఆశిస్తున్నారో వైసీపీ నాయకులు చెప్పాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ టి.సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు అప్పలరాజు, నాయకులు పి.చిన్నారావు, ఎస్.రమణబాబు, ఎల్.రామకృష్ణ, వెంకటరావు, రమేశ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

బాలసదనం విద్యార్థినులకు ఆర్‌వో ఫిల్టర్ వితరణ

చింతపల్లి, ఫిబ్రవరి 16: మండల కేంద్రంలోని బాలసదనం విద్యార్థినులకు కేబీ ఫౌండేషన్ ప్రతినిధులు ఆర్‌వో వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ కొక్కుల కన్నబాబు శుక్రవారం మాట్లాడుతూ ఆదివాసీ గ్రామాల్లో రక్షిత నీరు, సాగునీరు, విద్య కల్పనకు, ఫౌండేషన్ కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో కేబీ ఫౌండేషన్ ప్రతినిధులు రామారావు, .జానకిరామ్, కరుణాకర్, జీకే వంతల నాగేశ్వరరావు, జల్లి సుధాకర్, కూర్మారావు, చేయూత వారియర్స్ చైర్మన్ దూనబోయిన రమణ, బాలసదనం వార్డెన్ వసంతకుమారి పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థి సంఘం నేత సుమన్ కన్నుమూత

... 5వ పేజీ తరువాయి

చందాల రూపంలో సేకరించి సుమన్ కుటుంబానికి అందించారు. ఈ డబ్బులు ఖర్చు చేసినప్పటికీ అతని ఆరోగ్యపరిస్థితి మెరుగుపడలేదు. దీంతో శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచాడు. అతని భౌతిక కాయాన్ని పాడేరు తీసుకువచ్చి ప్రజల సందర్శనార్థం జీఎస్‌యూ భవనం వద్ద ఉంచారు. పలు సంఘాల నాయకులు వచ్చి సుమన్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. సాయంత్రం స్వగ్రామం వంచుర్భకు తరలించారు. శనివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

సంక్షిప్తంగా..

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి మౌఖిక పరీక్ష

పాడేరు రూరల్, ఫిబ్రవరి 16: పాడేరు డివిజన్‌లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం మౌఖిక పరీక్ష నిర్వహించారు. సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షకు 28 మంది హాజరయ్యారు. జిల్లాలో 32 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించగా, 28 మాత్రమే వచ్చాయని ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ చెప్పారు. ఆరు అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల కోసం నోటిఫికేషన్ జారీ చేయగా ఐదుగురు మాత్రమే దరఖాస్తు చేశారని చెప్పారు. అలాగే 18న హెల్పర్ పోస్టులకు 15 మంది, ఎనిమిది మినీ వర్కర్ల పోస్టులకు ఎనిమిది దరఖాస్తులు వచ్చాయని ఆమె వివరించారు. ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, ఆయా ప్రోజెక్టుల సీడీపీవోలు పాల్గొన్నారు.

జీవో-3కు ప్రత్యామ్నాయం తీసుకురావాలి

చింతపల్లి, ఫిబ్రవరి 16: గిరిజనులపై వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జీవో నంబరు-3కు ప్రత్యామ్నాయం తీసుకునిరావాలని ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏనాడూ జీవో-3పై మాట్లాడలేదన్నారు. డీఎస్సీలో జిల్లాకు 87 పోస్టులు కేటాయించగా, జీవో-3 అమలులో లేకపోవడంతో మూడు, నాలుగు ఉద్యోగాలు మాత్రమే ఆదివాసీలకు వస్తాయన్నారు. ఆదివాసీలపై జగన్‌కు మమకారం, ప్రేమ ఉంటే జీవో నంబరు-3కు ప్రత్యామ్నాయ జీవోను అమలులోకి తీసుకురావాలన్నారు. లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో ఆదివాసీలు ఓటుతోనే తగిన సమాధానం చెబుతారని ఆయన హెచ్చరించారు.

జాబ్‌మేళాలో 14 మంది ఎంపిక

అరకులోయ, ఫిబ్రవరి 16: మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన మినీ జాబ్‌మేళాలో 14 మందికి ఉద్యోగ అవకాశం కల్పించినట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధి జి.ప్రశాంత్ తెలిపారు. అపోలో ఫార్మసీ, నవత రోడ్ ట్రాన్స్‌పోర్టు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేటర్, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఎం.సతీష్‌కమార్ పాల్గొన్నారు.

సీహెచ్‌డబ్ల్యూల దీక్షలు విరమణ

పాడేరు రూరల్, ఫిబ్రవరి 16: సామాజిక ఆరోగ్య కార్యకర్త (సీహెచ్‌డబ్ల్యూ)లు చేపట్టిన సామూహిక నిరాహార దీక్షలను శుక్రవారం విరమించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ సీహెచ్‌డబ్ల్యూలకు నిమ్మరసం అందించి దీక్షలు విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలపై మూడు రోజులు దీక్షలు చేసినా సంబంధిత అధికారులు స్పందించకపోవడం విచారకమన్నారు. దీంతో ఈ నెల 19వ తేదీన చలో ఐటీడీఏ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, సీహెచ్‌డబ్ల్యూలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు, ఆశా, సీహెచ్‌డబ్ల్యూల సంఘ నాయకులు వై.మంగమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పీవీకి భారతరత్నపై హర్షం

సీలేరు, ఫిబ్రవరి 16: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న అవార్డు ప్రకటించడంపై జెన్‌కో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీలేరు జలవిద్యుత్ కేంద్రం వద్ద జెన్‌కో సెక్యూరిటీ కార్యాలయంలో పీవీ చిత్రపటానికి పూలమాలల వేసి మౌనం పాటించారు. జెన్‌కో డీఈ ఎం.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భాతరదేశానికి మొదటి తెలుగు ప్రధానిగా చేసిన పీవీ నరసింహారావు తెలుగు జాతికి ఎంతో గర్వకారణమని, అటువంటి వ్యక్తికి భారతరత్న అవార్డు లభించడం ఆనందకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ జెన్‌కో ఏడీఈ శ్రీకాంత్, ఏఈఈలు రమేష్, సీతారామ్, జెన్‌కో కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోండి

చింతపల్లి, ఫిబ్రవరి 16: పోలీసు శాఖ ప్రేరణ కార్యక్రమం ద్వారా ప్రైవేటు కంపెనీల్లో కల్పిస్తున్న ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ అరుణ్ కిరణ్ కోరారు. తాజా ఇంటర్వ్యూలో ఎంపికైన 35 మంది యువతులను బెంగుళూరు టాటా ఎలక్ట్రానిక్ కంపెనీకి శుక్రవారం ప్రత్యేక బస్సులో తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో గృహాలకే పరిమితమైన నిరుద్యోగ యువతీ, యువకులకు పోలీసు శాఖ ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తుందన్నారు. అయితే కుటుంబానికి, స్వగ్రామానికి దూరంగా ఉన్నామని మధ్యలో ఉద్యోగాలను విడిచి రాకూడదన్నారు. సెలవుల్లో మాత్రమే స్వగ్రామాలకు రావాలన్నారు. ఉద్యోగాల్లో చేరిన ప్రతి ఒకరికీ రూ.17-20 వేల వేతనం, వసతి కల్పిస్తున్నట్టు చెప్పారు.

సహకార బ్యాంకు సభ్యులకు ఈకేవైసీ తప్పనిసరి

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 16: సహకార సంఘాలను కంప్యూటరీకరణ చేస్తుండడంతో గుంటసీమ పీఏసీఎస్‌లో సభ్యత్వం పొందిన వారంతా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సంఘం మండల చైర్మన్ జి.మొద్దు సూచించారు. శుక్రవారం విలేకరులతో అయన మట్లాడుతూ 1987 నుంచి సభ్యత్వం కలిగిన వారి ఆధార్ కార్డ్, పాస్ ఫొటో, భూమిపట్టా, వన్‌బి అడంగల్‌తో పాటు ఫోన్ నంబర్లను బ్యాంకుకు అందించాలని కోరారు. మరింత సమాచారం కోసం 9490670853 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని ఆయన విన్నవించారు. ఈ కార్యక్రమంలో సీఈవో జి.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన శీతల పానీయం తాగిన ఇద్దరికి అస్వస్థత



కాలం చెల్లిన పానీయాలు ఇవే...

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 16: కుమడ పంచాయతీ కేంద్రంలోని ఒక దుకాణంలో శుక్రవారం కొనుగోలు చేసిన శీతల పానీయాన్ని తాగడంతో ఇద్దరు యువకులు అస్వస్థతకు గురయ్యారు. మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు ఈ పానీయం తాగిన కొద్ది సమయంలోనే వాంతులు చేసుకున్నారు. అనుమానం వచ్చి వాటిపై ఉన్న కాలపరిమితి తేదీని చూడగా కాలం చెల్లిపోయినట్టు గుర్తించారు. అయితే ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు స్పందించి దుకాణాల్లో కాలం చెల్లిన డ్రింకులు, ఇతర సరకుల విక్రయాలను నిరోధించాలని బాధితులు, స్థానిక ప్రజలు విజ్ఞప్తి కోరారు.